పబ్లిక్ టాయిలెట్లు లేక అవస్థలు

- మండల కేంద్రంలో టాయిలెట్లు కరవు
- ఒకటికి, రెంటికీ ఇబ్బందులు
- అంతర్రాష్ట్ర ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: ప్రతినిత్యం అంతర్రాష్ట్ర ప్రయాణికులు, మండలవాసులతో కిటకిటలాడుతున్న మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు లేక ఇక్కట్లు పడుతున్నారు. ఒకటికి, రెంటికీ ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర ప్రయాణికులు, మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. టాయిలెట్స్ నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించారు. కాని పాలకులు ఏమాత్రం దృష్టిసారించడం లేదు.

ఇబ్బందులు తప్పడం లేదు..

మండల కేంద్రమైన బస్టాండ్ చౌరస్తా, అంబేద్కర్ చౌ



మాగనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం (ఫైల్)



మాగనూర్ ప్రధాన కూడలిలోని వ్యాపార సముదాయాలు

రస్తా, ఆస్పత్రి ఏరియాతోపాటు ఇతర ప్రధాన కూడలిలో ఎలాంటి పబ్లిక్ టాయిలెట్లు లేవు. ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న టాయిలెట్ల నిర్వహణ లేకపోవడంతో అవి నిరూపయోగంగానే మారాయి. స్థానిక వ్యాపార సముదాయ ప్రాంతాల్లో వ్యాపారులు, కూలీలు, రైతులు తదితరులు ప్రతిరోజూ తమ పనుల నిమిత్తం ఇక్కడి వస్తుంటారు. వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, పల్లె ప్రగతి చేపట్టినా ఇక్కడ వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంకోసం లక్షల నిధులు మంజూరు చేస్తున్నా ప్రజాప్రతి నిధులతోపాటు గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

ప్రయాణికుల అవస్థలు..

నిత్యం హైదరాబాద్‌నుంచి మండల కేంద్రం మీదుగా రాయచూర్, గోవా లాంటి ప్రాంతాలకు పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు రాకపోకలు మండల కేంద్రంలోని జాతీయ రహదారి మార్గంలో వస్తుంటాయి. వందలాది మందిప్రయాణికుల రాకపోకలు ఇక్కడికి ప్రతినిత్యం కొనసాగుతున్నాయి. టాయిలెట్లకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

సమస్య పరిష్కరిస్తాం..



మండల కేంద్రంలో జాతీయ మార్గానికి ఇరువైపుల టాయిలెట్లు, మరుగుదొడ్లు లేని మాట వాస్తావమే. గతంలో ఇక్కడ అంత అవసరం ఉండేది కాదు. ప్రస్తుతం వ్యాపారం పెరిగింది. జనాల రాకపోకలు పెరిగాయి. ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం.

– రాజు, సర్పంచ్ , మాగనూర్

ఇబ్బందులు పడుతున్నాం..



ప్రధాన రహదారి వెంబడి మూత్రశాల, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఇతర గ్రామాల నుంచి మహిళలు వ్యాపార, బ్యాంకు, ఆస్పత్రి అవసరాల నిమిత్తం వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– ఎండీ సుల్తాన్, వ్యాపారస్తుడు, మాగనూర్

స్థలం లేకపోవడంతో..



మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో టాయిలెట్లు, మరుగుదొడ్ల ఏర్పాటుకు ప్రధాన సమస్య స్థలం లేకపోవడం. రోడ్డుకు ఇరువైపుల ప్రైవేట్ స్థలాలు ఉండటంతో నిర్మాణానికి ఆటంకాలు ఏర్పడుతుంది. త్వరలోనే గ్రామస్తులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

– జైపాల్‌రెడ్డి, ఎంపీఓ, మాగనూర్

క్లుప్తంగా

ఘనంగా బోనాల పండుగ



కృష్ణా: మండల పరిధిలోని గుడెబల్లూర్ గ్రామ పంచాయతీ టైరోడ్డులో ఆదివారం తాయమ్మ దేవతకు ఆ ప్రాంత ప్రజలతోపాటూ ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు బోనాలు ఎత్తారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటూ భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం మెకానిక్ ఆంజనేయులు, రైతు సంఘం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేష్, సర్పంచ్ మహాదేవమ్మల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

భగవద్గీతపై ప్రచారం



ధన్వాడ: ఆషాఢమాసం గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ధన్వాడ మండలంలోని గోటూర్‌లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. హిందూ జ్ఞానవేదిక కార్యవర్గ సభ్యుడు నాగ్యానాయక్, రాంరెడ్డి, విష్ణు, అశోక్, కిషోర్, రామయ్య, వెంకటేష్, రజిత, లహరి తదితరులు ఉన్నారు.

వెంకటాపూర్‌పై వివక్ష తగదు



మరికల్: ఉన్నత అధికారులు గర్వపడేలా అభివృద్ధి చెందుతున్న వెంకటాపూర్‌పై ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి చిన్నచూపు చూడటం తగ్గదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం వెంకటాపూర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారం రోజులక్రితం ఎమ్మెల్యే ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. వెంకటాపూర్‌లో ఓ అసమర్థత సర్పంచ్‌ను గెలిపించుకున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్పంచ్‌ను గెలిపించుకుని రావాలని అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని చెప్పడం ఎమ్మెల్యేకు తగునా అంటూ ప్రశ్నించారు. ఓ మహిళ సర్పంచ్ ఎమ్మెల్యే సపోర్ట్‌లేకుండా గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసిన ఘనత సర్పంచ్ కళావతమ్మకు దక్కిందన్నారు. సర్పంచ్‌ను విమర్శించిన ఎమ్మెల్యే ఆమెకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీరకుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రతంగపాండురెడ్డి, సంజీవరెడ్డి, మనోహర్, మల్లేష్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న దేవరి మల్లప్ప



మక్తల్: ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ పాతబస్తీలో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప అమ్మవారికి బోనాలతోవెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ వేదపండితులు దేవరి మల్లప్పను శాలువాతో సన్మానం చేసి ఆశీర్వదించారు.

మార్పు కోసం మహా ఉద్యమం

అమరచింత: దగాపడ్డ తెలంగాణలో విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ 'మార్పు కోసం మహా ఉద్యమం' అనే కార్యక్రమాన్ని ఆగస్టు 1న హైదరబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జిల్లా నాయకుడు వినోద్, మండల కన్వీనర్ అఖిల్ తెలిపారు. మార్పు కోసం మహా ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం మండలంలోని హైస్కూల్ ఆవరణలో విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.91లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేష్, ప్రశాంత్, బాలు, భరత్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరి మాత జయంతి

ఆత్మకూర్: తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరీ మాత జయంతి ఉత్సవాలు సోమవారం ఉదయం నిర్వహిస్తున్నామని, భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. మండలంలోని తిప్పుడంపల్లిలో ఉదయం 6గంటల నుంచి మొదలుకొని చౌడేశ్వరీ మాత ఆలయంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. భజన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బలరాం, నాయకులు పెరుమాళ్ల బాలరాజు, సత్యన్న, ఈశ్వరయ్య, పేరుమాల్ల సత్యన్న కోరారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇష్టాగోష్టి

నారాయణపేట రూరల్ : బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన సద్దుల సమావేశం విజయవంతమైంది. జిల్లా కేంద్రం నుంచి పెద్ద ఎత్తున కమలం నాయకులు ఇంట్లో వంటలు చేసుకుని లోకాయపల్లి శివారులోని వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ వనభోజనం చేసి పార్టీ పటిష్ఠతపై చర్చించారు. నాగురావునామాజి, రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ప్రభాకరవర్ధన్, సత్యాయాదవ్, నందునామాజి, రఘువీర్‌యాదవ్ తదిరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం టిఫిన్‌బాక్స్ ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. మంతన్‌గోడ్ దత్తత్రేయస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్రవర్గ సభ్యులు జలంధర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యకర్తలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్ఠతకు కృషిచేయాలని కోరారు. ఎంపీటీసీ హన్మంతు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వన భోజనం చేస్తున్న బీజేపీ నాయకులు

మక్తల్: మహాజన్ సంపార్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మంతన్ గోడ్ సమీపంలో ఉన్న దత్తత్రేయ ఆలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ డబ్బా ఇష్టాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని అక్కడే భోజనం చేశారు. బీజేపీ చేస్తున్న కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గసభ్యుడు మాదిరెడ్డి, జలంధర్‌రెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు భరత్, నాయకులు మేర్వరాజు, నారాయణ, శ్రీనివాసులు, భాస్కర్, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన పనులు.. అవస్థల్లో ప్రయాణికులు



నర్వ: మండలంలోని మక్తల్, గద్వాల్ ప్రధాన రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలల క్రితం పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ రహదారిపై ఒకపక్క రోడ్డును తొలగించి గోతులలో కంకర వేయడంతో పెద్దకడ్మూర్ నుంచి మిట్టనందిమల్ల వరకు వేసిన కంకర రోడ్డులో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సత్యవార్ నుంచి మిట్టనందిమల్ల వరకు రహదారి పూర్తిగా దెబ్బతినడంతో రహదారి పనులు పూర్తిచేసి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: మండలంలో చోరీకి గురి అయిన సెల్‌ఫోన్‌ను నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి ఆదివారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని ఆరేపల్లికి చెందిన సాయికుమార్ సెల్‌ఫోను నాలుగు రోజుల క్రితం చోరీకి గురయిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆచూకీ కనుగొన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయినా.. లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీలోని ఎనిమిదో వార్డుల్లో ఆయన పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేకు కాలనీవాసులు శాలువాతో సన్మానం చేసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రవి, వెంకట్‌రాములు, సురేష్, ప్రభాకర్‌రెడ్డి, అనంద్‌గౌడ్, శ్రీకాంత్, బుగ్గప్ప, ఏఈ నాగశివ, శేఖర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

ప్రమాదకరంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్



మాగనూర్: మండల కేంద్రంలోని హెస్‌ఎచ్–167 రహదారికి ఇరువైపులా నూతనంగా నిర్మించిన డ్రైనేజీ అప్పుడే అస్తవ్యస్తంగా తయారైందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొన్నిచోట్ల మ్యాన్‌హోల్స్ విరిగిపడి ప్రమాదకరంగా ఉంది. మారుతి ఆస్పత్రి సమీపంలో గతకొన్నిరోజులుగా మ్యాన్‌హోల్ విరిగిపడి ఇళ్లకువెళ్లే వారికి ఇబ్బందికరంగా మారింది. డ్రైనేజీలో మట్టి ఉండటంతో మురుగునీరు వెళ్లకపోవడంతో ఇళ్లలోకి దుర్వాసన వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీని సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆత్మకూర్: పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో హరహర మహాదేవ శంభోశంకర పాహిమాం అంటూ శివనామ స్మరణతో మార్మోగింది. మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమశివుడికి రుద్రాభిషేకం, బిల్వాభిషేకం, జలాభిషేకం తదితర పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు శివానందస్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాముల సంఘం నాయకులు బాలకృష్ణ, బాల్‌రాజు, అంజి, శ్రీధర్, రవిందర్, రాము, భవాని సంఘం నిర్వాహకులు భారతి, నాగలక్ష్మి, సత్యన్న, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, మార్కెట్ కార్యదర్శి శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటి లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ఏకరుద్రాభిషేక పూజలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పరమశివుడి జన్మనక్షత్రమై ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాస శివరాత్రి, ఆరుద్రనక్షత్రం రెండు కలిసి రావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని ఆలయంలోని శివలింగానికి పాలాభిషేకం చేస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదానం చేశారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



మక్తల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్ : రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్మికులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె 11వ రోజుకుకు చేరింది. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జీపీ కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, కనీస వేతనం రూ.19500 చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. కా ర్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నర్సింహా లు, సర్పంచ్ విజయలక్ష్మి, యూనియన్ నాయకులు రాంచందర్, వెంకటమ్మ, నర్సమ్మ, భారతమ్మ, కాజమ్మ, గోవింద్, నర్సమ్మ, వెంకటయ్య, హన్మంతు, కృష్ణయ్య, చంద్రమౌళి, మాణిక్యప్ప, వెంకటేష్, కాశమ్మ, రాయప్ప, మహేష్ పాల్గొన్నారు.

మక్తల్: పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపడుతున్న సమ్మె ఆదివారంతో 11రోజుకు చేరింది. కార్యక్రమంలో జిల్లా ఇఫ్టూ అధ్యక్షుడు కిరణ్, వెంకటేష్, భగవంత్, రాంచద్రి, నర్సింహా, నారాయణ, కార్మికులు శ్రీనివాసులు, నర్సింహ, కిష్టప్ప, నరేష్, సాయన్న, నర్సప్ప, రాజు, ఆంజనేయులు, రాములు, బాల్‌రాజు, చంద్రయ్య పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించి, ఉద్యోగం కుటుంబంతో పాటు సేవకు స్థానంకల్పించాలని డిస్ట్రిక్ వైస్ గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కృష్ణగోకులం స్కూల్‌లో టౌన్‌క్లబ్ 14వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా సంపత్, ఉపాధ్యక్షుడిగా రఘుబాబు, మోహన్, కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డి, కో–షాధికారిగా మహేష్‌గౌడ్‌లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నో రకాలుగా వృథా చేస్తున్న డబ్బు, సమయాన్ని క్లబ్ సేవలకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ రమేష్‌రావు, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు సుధార్మన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, చెన్నారెడ్డి, లింగం, రవికాంత్, మొల్గాన్‌జనార్దన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిన సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని జిల్లా అధ్యక్షుడు రుద్రసముద్రం రాములు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2003తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి రిటైర్మెంట్ తర్వాత పింఛన్ సౌకర్యం లేదని, దీంతో కుటుంబ పోషణకు ఇతరులపై ఆధారపడాల్సిన దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పాతపింఛన్ విధానం అమలు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం చొరవ తీసుకుని జీఓ 317లో నష్టం జరిగిన టీచర్లకు న్యాయం చేయాలని, భాషా పండితుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాంమోహన్‌రావు, విభీషణ్, శ్రీనివాస్, వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

కోస్గి: హాత్ సే హాత్ జోడో పాదయాత్ర పేరుతో గుండుమాల్ మండల పరిధిలో కాంగ్రెస్ నాయకులు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం హన్మాన్‌పల్లిలో పర్యటించి ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలో ర్యాలీగా తిరుగుతూ కేసీఆర్ ప్రభుత్వం మోసాలను వివరిస్తూ కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ఓటర్లను కోరారు. రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి, గ్రామ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రచారంలో టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, భానునాయక్, గాల్‌రెడ్డి, నాగులపల్లి శ్రీనివాస్, నరేందర్, వెంకట్‌రాంరెడ్డి, గిరిప్రసాద్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



గుండుమాల్ ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

కృష్ణా: మండలంలోని టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్, నియోజకవర్గ నాయకుడు అవినాష్ జగన్నాథ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రజలకు చేస్తున్నా మోసాలను వివరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ మండల నాయకులు సురేష్, మహాదేవ్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పదోతరగతి 1988–89 బ్యాచ్ విద్యార్థులు గ్రామ శివారులోని పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పొలం వద్ద పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 35 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కొల్లూరుకు చెందిన తిమ్మప్ప కుమారుడు ఇటీవల ఎంబీబీఎస్ సీటు సాధించడంపై ఆయనకు ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు సూర్యప్రకాష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహమ్మద్‌రఫీ, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్, విజయశ్రీ, నరేష్, కిరణ్, ఉమామహేష్ పాల్గొన్నారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

మరికల్: చిత్తనూర్ వద్ద నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దుచేసే వరకు తమ పోరాటం ఆగదని కేఎన్‌పీఎస్ జాతీయ నాయకులు లక్ష్మయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని చేపడుతున్న నిరవధిక దీక్ష ఆదివారంతో 16వ రోజుకు చేరింది. నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు.. ఇథనాల్ కంపెనీ నిర్మిస్తే తమ పంటలు దెబ్బలు తీంటాయని, నిర్మాణ పనులు ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రయ్య, మధు, వెంకటయ్య, ఇర్ఫాన్, నరేందర్, మొగిలప్ప, మహాదేవప్ప పాల్గొన్నారు.

ఉద్యమంలో మహిళలు ముందుండాలి

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండను మండలం చేయాలని కొనసాగుతున్న నిరసన దీక్షలు ఆదివారంతో 68వ రోజుకు చేరింది. దీక్షలో మహిళా సంఘం సభ్యులు కూర్చోగా సర్పంచ్ విజయలక్ష్మి దండలు వేసి దీక్షలు ప్రారంభించి మాట్లాడారు. ఉద్యమంలో మహిళలు ముందుండాలని కోరారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, అన్నిఅర్హతలు ఉన్న తమగ్రామాన్ని మండలం చేయాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. ఇటీవల వరుసగా ఎన్నో గ్రామాలను మండలాలుగా చేసిన కేసీఆర్ కోటకొండతోపాటు కాన్‌కుర్తి, గార్లపహాడ్‌లకు సైతం అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, రాము, సలీం, చెన్నప్ప, రాములు, కృష్ణ, లక్ష్మప్ప, రాజు, నారాయణ పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సర్పంచ్

వాల్మీకి బోయలను ఎస్టీజాబితాలో చేర్చాలి

ఆత్మకూర్: వాల్మీకులు అన్నిరంగాల్లో వెనుకబడ్డారని, వారిని ఎస్టీజాబితాలో చేర్చి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వాల్మీకి బోయ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో మండలంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వాల్మీకులకు ఐదు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వాల్మీకీ ఫెడరేషన్ ఏర్పాటు చేసి వేయ్యి కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఎలాంటి కుల వృత్తి లేని తమకు వాల్మీకీ బంధు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండ్ల విజయ్, కావలి వెంకటన్న, ఎస్టీడీ శ్రీను, కొత్తబోయ శేఖర్, కావలి రఘు, సూరి, కురుమూర్తి, రాజశేఖర్, ఖాజన్న ఉన్నారు.